సాక్షి
కాకినాడ

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



గణపతి లడ్డూ @ రూ.1.07 లక్షలు


పి.గన్నవరం: జి.పెదపూడి లక్ష్మీ గణపతి ఆలయం వద్ద లడ్డూను బుధవారం స్థానికుడైన పోలిశెట్టి చిన సత్యనారాయణ రూ.1.07 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు.



చిరుత ఎక్కడ!

లాలాచెరువు, దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టులో సంచరిస్తుందంటున్న చిరుతపులి జాడ చిక్కడం లేదు. అది ఎక్కడ తిరుగుతుందో తెలియడం లేదు. - 8లో

1.98 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 1,98,551 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

---

1 ప్రతి నిరుద్యోగికి రూ.3,000 భృతి



20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. అప్పటి వరకూ ప్రతి నిరుద్యోగికీ ప్రతి నెలా రూ.3,000 భృతి ఇస్తాం.

– కాకినాడ సిటీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

2 రైతుకు ఏటా రూ.20,000 సాయం



కూటమి ప్రభుత్వం వస్తే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు ఏటా రూ.20,000 సాయం అందిస్తాం.

– ఎన్నికల ప్రచారంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

3 ప్రతి ఇంటికి ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం



టీడీపీ అధికారంలోకి వస్తూనే ప్రతి ఇంటికి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం.

– పెద్దాపురం ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

4 తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15,000



టీడీపీ అధికారంలోకి రాగానే తల్లికి వందనం పథకం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15,000 ఇస్తాం.

– కాకినాడ రూరల్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పంతం నానాజీ

5 మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం






టీడీపీ ప్రభుత్వం వచ్చాక మహిళలందరికీ ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం.

– ఎన్నికల ప్రచారంలో ప్రత్తిపాడు, తుని ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, యనమల దివ్య

6 మహిళలకు ప్రతి నెలా రూ.1,500



18 సంవత్సరాల వయస్సు నిండిన మహిళందరికీ ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రతి నెలా రూ.1,500 అందిస్తాం.

– పిఠాపురం ఎన్నికల ప్రచార సభల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

'తల్లికి వందనం' కోసం ఎదురు చూస్తున్నాం



ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంత మంది ఉంటే అంత మందికీ అన్ని రూ.15 వేలు ఇస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. నాకు ముగ్గురు కుమార్తెలు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. తల్లికి వందనం పేరిట మాకు రూ.45 వేలు వస్తాయని ఎదురు చూస్తున్నాం. కొంత మంది కొన్ని నెలల్లో వస్తాయని అంటే, మంత్రి నారా లోకేష్ వచ్చే సంవత్సరం కానీ ఇవ్వలేమని చెప్పారంటున్నారు. ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలి.

– కె.దేవి, రంగవల్లి నగర్, రామవరం, జగ్గంపేట మండలం

రైతుల ఆశలపై నీళ్లు



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులను కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ ఖరీఫ్‌లో ఇప్పటికే వరి నాట్లు వేసుకున్నాం. ఇప్పటి వరకూ ఎకరానికి రూ.8 వేల వరకూ పెట్టుబడి పెట్టాం. కానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు ఎటువంటి ఆర్థిక సహాయమూ అందలేదు. గతంలో పంటల ప్రారంభ సమయంలోనే రైతు భరోసా ఆర్థిక సహాయం ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ మాటే వినిపించడం లేదు. పేరు మాత్రం అన్నదాత సుఖీభవగా మార్చి, రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇంకా రబీ ధాన్యం డబ్బులు కూడా ఇవ్వలేదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందలేదు. పెట్టుబడి ఏ విధంగా పెట్టాలో అర్థం కావడం లేదు.

– తలారి దొరబాబు, రైతు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

ఫీజులు కట్టాలంటున్నారు



ప్రభుత్వం తల్లికి వందనం డబ్బులు ఇస్తుందన్న నమ్మకంతో.. దగ్గరగా ఉందని మా ఇద్దరు పిల్లలను ప్రైవేటు స్కూల్‌లో చేర్చాము. ఆ డబ్బులు ఎప్పుడిస్తారో ప్రభుత్వ పెద్దలు కచ్చితంగా చెప్పడం లేదు. విద్యాశాఖాధికారులను అడిగితే ఇంకా తెలీదని అంటున్నారు. ఈ ఏడాది ఇవ్వకపోవచ్చని పలువురు చెబుతున్నారు. తల్లికి వందనం సొమ్ముతో తమకు సంబంధం లేదని, తక్షణం ఫీజులు కట్టాలని పాఠశాల యాజమాన్యం అంటోంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. గత ప్రభుత్వంలో ఏటా ఠంచనుగా అమ్మ ఒడి డబ్బులు వచ్చేవి. ఈ ప్రభుత్వం తీరు అనుమానాస్పదంగా వుంది.

– లింగంశెట్టి చక్ర వీరలక్ష్మి, రామవరం, జగ్గంపేట మండలం

మాట నిలబెట్టుకోండి



మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ఇప్పటి వరకూ ఏ విధమైన సహాయం లేదు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– ఎ.రామవతి, కాకినాడ

ఉచిత గ్యాస్ ఊసే లేదు



ఎన్నికల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై విపరీతంగా ప్రచారం చేశారు. ఆ మాట నమ్మి కూటమి పార్టీలకు మహిళలు అధికారం కట్టబెట్టారు. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. సాకులు చెప్పి ఈ పథకం అమలు చేయకపోతే మహిళల ఆగ్రహానికి గురి కాక తప్పదు.

– సాదే ఉషారాణి, ఏలేశ్వరం

ఉచిత బస్సు ఎప్పుడు



మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్న హామీని ఏం చేశారు? ప్రభుత్వం వచ్చి వంద రోజులైనా ఈ విషయమై ఇప్పటికీ విధి విధానాలు రూపొందించలేదు. కేవలం మహిళల ఓట్ల కోసమే ఎన్నికల్లో ఈ హామీ ఇచ్చి, విజయం సాధించాక మాట్లాడకపోవడం అన్యాయం. గతంలో కూడా డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామని చెప్పి, గెలిచాక ఇలాగే మాట తప్పారు. ఉచిత బస్సు సౌకర్యంపై ముఖ్యమంత్రి తక్షణమే పెదవి విప్పాలి.

– నస్రీన్ ఫాతిమా, కాకినాడ

సూపర్ ఫట్


- అరు గ్యారెంటీలపై అయోమయం!
- టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్న చంద్రబాబు
- ఎన్నికల ప్రచార సభల్లో కూటమి నేతల హామీలు
- అధికారం చేపట్టి వంద రోజులు కావస్తున్నా అమలుపై స్పష్టత కరవు
- రోజుకో ప్రకటన చేస్తున్న కూటమి నేతలు
- అసలు అమలు చేస్తారా.. లేదా అని ప్రశ్నిస్తున్న ప్రజలు
- ఎన్నికల్లో గట్టెక్కేందుకే నాడు ఈ హామీల నాటకమని విమర్శ





సాక్షి ప్రతినిధి, కాకినాడ: అలవి కాని హామీలతో ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చాక వాటిని గాలికొదిలేయడంలో చంద్రబాబు ఘనపాఠి. అదే తీరులో తాజా సార్వత్రిక ఎన్నికల వేళ అమలుకు సాధ్యం కాని హామీలతో ఊదరగొట్టారు. సూపర్-6 అంటూ ప్రజలను మభ్యపెట్టారు. 'బాబు ష్యూరిటీ – భవిష్యత్‌కు గ్యారెంటీ' అంటూ ఇంటింటికీ కరపత్రాలు పంచారు. బాబు తానా అంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తందానా అంటూ వంత పాడారు. గత అనుభవాలతో చంద్రబాబు మరోసారి మోసం చేస్తారేమోననే అనుమానం ఉన్నప్పటికీ.. అధిక శాతం ప్రజలు ఆయన వలలో చిక్కారు. 'మారిన మనిషి'నని పదేపదే చెప్పడంతో నిజంగా మారారనుకుని.. హామీలు నెరవేరుస్తారేమోనని భ్రమ పడి ఓట్లేశారు. తీరా చూస్తే షరా మామూలుగానే 'మారని మనిషి'నని నిరూపించుకుంటున్నారు. అధికార పగ్గాలు చేపట్టి వంద రోజులవుతున్నా హామీల ఊసే లేదు. అప్పులు.. ఆర్థిక ఇబ్బందుల పేరిట రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. ఎవరిని కదిపినా ఓట్ల కోసం చంద్రబాబు మరోసారి తమను నిలువునా వంచించారనే అభిప్రాయమే వినిపిస్తోంది. టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ఎన్నికల హామీల అమలుపై అన్ని వర్గాల ప్రజలూ సందేహం వ్యక్తం చేస్తున్నారు. హామీలు గాలిలో కలిపేసి, జనానికి సున్నం కొట్టేందుకే రోజురోజుకూ సరికొత్త డ్రామాలకు తెర తీస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. 2014 ఎన్నికల్లో కూడా చంద్రబాబు ఇదేవిధంగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ హామీని ఎగ్గొట్టారు. బ్యాంకుల్లో రైతులు కుదువ పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబుకే ఓటేయాలని నమ్మించి మాట తప్పారు. నిరుద్యోగులకు జాబు హామీనీ అటకెక్కించేశారు. తాజాగా చంద్రబాబు మారారనుకుని సూపర్-6 హామీల అమలు కోసం లక్షలాది మంది మళ్లీ కళ్లల్లో ఒత్తులేసుకుని నిరీక్షిస్తున్నారు.


తల్లికి వం'ధన'మేదీ!



అమ్మ ఒడి పథకాన్ని కాపీ కొట్టి తల్లికి వందనం అంటూ పేరు మార్చి, కుటుంబంలో చదువుకుంటున్న పిల్లలందరికీ ఏడాదికి రూ.15,000 ఇస్తామని చంద్రబాబు సహా కూటమి నేతలు ఎన్నికల్లో ప్రజలను నమ్మించారు. దీనిపై నిరుపేద కుటుంబాలు గంపెడాశలు పెట్టుకున్నాయి. తీరా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క చిన్నారికి మాత్రమే ఇస్తామని విడుదలైన జీఓపై పేదలు, మధ్య తరగతి కుటుంబాలు అగ్గి మీద గుగ్గిలమవుతున్నాయి. దీంతో లోకేష్ అదేంలేదు అందరికీ ఇస్తామని సరిదిద్దుకున్నారు. కానీ అధికారంలోకి వచ్చి వంద రోజులైనా నేటి చిల్లి గవ్వకూడా ఇవ్వలేదు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు	: 3,31,015
అర్హులైన విద్యార్థులు	: 1,86,708
ఏటా రూ.15,000 చొప్పున అందించాల్సిన సాయం	: రూ.280.06 కోట్లు

రైతుకు దగా!




సూపర్-6 హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలి. దీని ప్రకారం జిల్లాలోని 1,74,229 మంది రైతులకు ఈ ఏడాది రూ.348.45 కోట్లు అందించాల్సి ఉంది. ఇప్పటికే ఖరీఫ్ నాట్లు దాదాపు పూర్తి కావస్తున్నప్పటికీ చంద్రబాబు, కూటమి నేతలు ఎక్కడా దీనిపై నోరు మెదపడం లేదు. హామీ అమలు చేయకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

మహిళలకు మస్కా



పద్దెనిమిదేళ్లు నిండిన మహిళలకు ప్రతి నెలా రూ.1,500 అందజేస్తామని చంద్రబాబు అండ్ కో కాకినాడ, తుని, పిఠాపురం తదితర నియోజకవర్గాల్లోని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. తీరా గద్దెనెక్కి వంద రోజులైనా ఇంతవరకూ ఈ హామీపై చంద్రబాబు సహా కూటమి నేతల నుంచి ఉలుకూ పలుకూ లేదు. ఈ సాయం కోసం దాదాపు రెండు నెలలుగా జిల్లాలోని 7,37,471 మంది మహిళలు ఎదురు చూస్తున్నారు. 2014 ఎన్నికల్లో చెప్పిన డ్వాక్రా రుణమాఫీ హామీ మాదిరిగానే దీనిని కూడా అటకెక్కించేస్తారని మహిళలు అనుమానిస్తున్నారు.


యువతకు కుచ్చుటోపీ!



జిల్లా జనాభా 22,47,860. గ్రామీణ ప్రాంతాల్లో 16,36,389, పట్టణ ప్రాంతాల్లో 6,11,471 మంది ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా 5,33,908 కుటుంబాలున్నాయి. ప్రతి కుటుంబంలోనూ ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఇంజినీరింగ్, పీజీ ఇలా ఏదో ఒకటి పూర్తి చేసిన కనీసం ఒకరు ఉన్నారు. ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3,000 భృతి ఇస్తామని ఎన్నికల వేళ చంద్రబాబు, కూటమి నేతలు హామీ ఇచ్చారు. దీని ప్రకారం. జిల్లా వ్యాప్తంగా 5,33,908 మంది పైచిలుకు నిరుద్యోగులకు వెంటనే ఉద్యోగం లేదా ప్రతి నెలా సుమారు రూ.160 కోట్లు పైగా నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా ఆ మాటే ఎత్తడం లేదు.

జిల్లాలో 18 ఏళ్లు నిండిన మహిళలు	: 8,29,471
వీరిలో సామాజిక పింఛన్లు పొందుతున్న వారు	: 92,000
రూ.1,500 పొందేందుకు అర్హులు	: 7,37,471
ఏటా వీరికి అందించాల్సిన సాయం	: రూ.1,327.44 కోట్లు

ఉచితం ఊసేదీ!



జిల్లాలోని కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోల పరిధిలో 300 బస్సులున్నాయి. వీటిల్లో రోజుకు 80 వేల మంది ప్రయాణిస్తున్నారు. వీరి ద్వారా ఆర్టీసీకి రోజుకు సుమారు రూ.50 లక్షల ఆదాయం వస్తోంది. రోజువారీ ప్రయాణికుల్లో 40 వేల మందికి పైబడి మహిళలే ఉంటారని అధికారులు చెబుతున్నారు. ఉచిత ప్రయాణం అంటే వీరి సంఖ్య అవకాశం ఉంటుంది. ఈ లెక్కన రోజుకు రూ.25 లక్షల చొప్పున ఏడాదికి రూ.91 కోట్లు పైగా లబ్ధి చేకూరాల్సి ఉంది.

వట్టి 'గ్యాసేనా!'



జిల్లావ్యాప్తంగా 6.34 లక్షల వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి ఇంటికీ ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు చెప్పారు. ఆయన లెక్కల ప్రకారం చూసుకున్నా జిల్లాలో ఈ పథకానికి అర్హత ఉన్న 19,02,000 ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర 827.51గా ఉంది. ఉచిత వంట గ్యాస్ ఇవ్వకపోవడంతో జిల్లాలోని వినియోగదారులు ఏటా రూ.157.39 కోట్ల మేర నష్టపోతున్నారు.

బంపర్ హిట్

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని పలువురు ఢంకా బజాయించి మరీ చెబుతున్నారు. అమ్మ ఒడి డబ్బులు జూన్ నెలలోనే జమచేసే వారని విద్యార్థుల తల్లులు గుర్తు చేసుకుంటున్నారు. ఖరీఫ్ నాట్లు పూర్తి కాకుండానే పెట్టుబడి సాయం అందించేవారని రైతులు చెబుతున్నారు. రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా ఏటా ప్రతి రైతు కుటుంబానికి రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందించిన రోజులు గుర్తుకు వస్తున్నాయని అంటున్నారు. కేంద్రంతో సంబంధం లేకుండా కౌలు రైతులు, అటవీ భూములు, దేవదాయ భూముల సాగుదారులకు కూడా రైతు భరోసా పూర్తి మొత్తం రూ.13,500 జగన్ సర్కారే అందజేసేది. అటువంటిది నేడు ఖరీఫ్ సాగు మొదలై వంద రోజులవుతున్నా చంద్రబాబు చిల్లిగవ్వ సాయం కూడా అందించ లేదని ఆక్షేపిస్తున్నారు. భారీ వర్షాలు, వరదలతో కొన్ని ప్రాంతాల్లో పంటలు నీట మునిగి రైతులు లబోదిబోమంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అదే జగన్ హయాంలో విపత్తులకు పంట దెబ్బ తింటే యుద్ధ ప్రాతిపదికన అంచనాలు రూపొందించి, సీజన్ దాటకుండానే సాయం అందించేవారని చెబుతున్నారు. రైతులకు జగన్ ఉచిత పంటల బీమా అమలు చేస్తే చంద్రబాబు దానికి మంగళం పాడుతూ మంత్రివర్గంలో తీర్మానం కూడా చేయడంపై రైతులు కన్నెర్ర చేస్తున్నారు.



అమ్మ ఒడి సాయం.. అందించారిలా..

ప్రజాసంకల్ప యాత్రలో నిరుపేదల కష్టాలు ప్రత్యక్షంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే అమ్మ ఒడి పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా చదువుకుంటున్న పిల్లలున్న 7,63,766 మంది అర్హులైన తల్లులకు రూ.1,145.63 కోట్ల సాయం అందించారు.

విద్యా సంవత్సరం	లబ్ధి పొందిన తల్లులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	1,87,654	281.48
2020-21	2,01,247	301.86
2021-22	1,88,157	282.23
2022-23	1,86,708	280.06
మొత్తం	7,63,766-	1,145.63

అన్నదాతకు మేలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా 1,74,229 మంది రైతులకు రూ.654.18 కోట్ల మేర రైతుభరోసా లబ్ధి అందించారు.

సంవత్సరం	రైతులు	రైతుభరోసా లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	1,70,698	93.88
2020-21	1,66,963	125.22
2021-22	1,62,125	121.59
2022-23	1,69989	161.69
2023-24	1,74,229	151.80

వేలాది మందికి ఉద్యోగాలు

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వేలాది మందికి ఉద్యోగాలు ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా 620 గ్రామ/వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి, 5,324 మంది ఉద్యోగులను నియమించారు. విద్య, వైద్య శాఖల్లో ఖాళీలు భర్తీ చేశారు. ఇంకా వందలాది మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించారు.

క్లుప్తంగా

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీగా శివరామ్

కాకినాడ లీగల్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ (డీఐజీ)గా బి.శివరామ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శివరామ్ కడప డీఐజీగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయన 2019లో జిల్లాలో ఇన్చార్జి డీఐజీగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకూ డీఐజీగా పనిచేసిన ఎ.నాగలక్ష్మి విజయనగరానికి బదిలీ అయ్యారు.

ఆర్టీసీ బస్సులో గంజాయి స్వాధీనం

గోకవరం: ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని గోకవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోకవరం మండలం రామన్న పాలెం వద్ద గంజాయి కట్టడి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టు వద్ద ఆర్టీసీ బస్సులో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. వారి నుంచి 30 కేజీల వరకూ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు మహిళలుగా తెలియవచ్చింది. దీనిపై పోలీసులు ఎటువంటి వివరాలు వెల్లడించలేదు.

బాణసంచా అక్రమ తయారీపై నిఘా

గోకవరం: అక్రమంగా బాణసంచా తయారీ, సరఫరా, విక్రయాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపారు. గోకవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో జనసంచార ప్రదేశంలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకుని, ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఇళ్ల మధ్యలో ఇటువంటి నిల్వలు ఉన్నట్టు సమాచారం ఉంటే 112కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య

కోటనందూరు: గుర్తు తెలియని వ్యక్తిని దుండగులు దారుణంగా హత్య చేశారు. ఎస్సై టి.రామకృష్ణ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరపుకోట శివారులో సుమారు 40 ఏళ్ల వ్యక్తిని దుండగులు కత్తితో పొడిచి చంపారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవ రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ కూడా పరిశీలించాయి. వీఆర్వో సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వేంకటేశ్వరస్వామికి వెండి కవచం సమర్పణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని ఉపాలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామికి బుధవారం సఖినేటిపల్లిపాలేనికి దంతులూరి కుమార వర ప్రసాద వెంకట సత్యనారాయణరాజు, కుటుంబ సభ్యులు సంపూర్ణ వెండి కవచం బహూకరించారు. సుమారు రూ.3.50 లక్షల విలువైన ఈ వెండి కవచం 3.400 గ్రాముల (రాళ్లతో కలిపి) బరువు ఉంది. ఈ మేరకు బుధవారం ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు దాత అందజేశారు.

చిరుత ఎక్కడ!



ఈ నెల 15వ తేదీన ట్రాప్ కెమెరాలో రికార్డు అయిన చిరుతపులి కదలికలు

- కానరాని జాడ
- కెమెరాలకూ చిక్కని వైనం
- కొనసాగుతున్న అటవీ అధికారుల ప్రయత్నాలు

రాజానగరం: లాలాచెరువు, దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టులో సంచరిస్తుందంటున్న చిరుతపులి జాడ చిక్కడం లేదు. అది ఎక్కడ తిరుగుతుందో తెలియడం లేదు. అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపడుతున్నా, బోన్లు పెట్టినా కనిపించలేదు. నిఘా కెమెరాలకు కూడా చిక్కడం లేదు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని మహా పుష్కరవనం పరిసరాల నుంచి చిరుతపులి ఒక జంతువును నోట కరుచుకుపోయిందని ఈ నెల 5న అర్ధరాత్రి సమయంలో ఒక ప్రయాణికుడు ఇచ్చిన సమాచారం అలజడి రేపింది. దానిని సురక్షితంగా బంధించి, అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేందుకు అటవీశాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు రెండు వారాలు దాటుతున్నాగానీ ఇంత వరకూ సరైన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. దీనితో రిజర్వు ఫారెస్టు ఏరియాను ఆనుకుని నివాసం ఉంటున్న వారితో పాటు అటువైపుగా ఉన్న జాతీయ రహదారిపై ప్రయాణించేవారు, రహదారి వెంబడి వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నవారు నిత్యం భయంగా జీవనం సాగిస్తున్నారు.

50 ట్రాప్ కెమెరాలు

చిరుతపులిని జాడను తెలుసుకునేందుకు అటవీశాఖ వివిధ ప్రాంతాలలో 50 ట్రాప్ కెమెరాలను అమర్చింది. మరికొన్ని ప్రాంతాలలో ఇనుప బోనులు ఏర్పాటు చేసింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా థర్మల్ డ్రోన్ కెమెరాను కూడా ఉపయోగించి శోధన చేస్తోంది. ఇన్ని చేసినా ఆ చిరుతపులి నాలుగు రోజులుగా ఏ కెమెరాకు చిక్కకుండా దోబూచులాడుతోంది. ఆదివారం తెల్లవారుజామున (15వ తేదీ) రిజర్వు ఫారెస్టులోని వివిధ ప్రాంతాలలో అటవీశాఖ అమర్చిన ట్రాప్ కెమెరాలలో చిరుతపులి కదలికలు రికార్డు అయ్యాయి. ఆ తరువాత ఇంతవరకు దాని జాడ తెలియలేదు.

పులి ఏమైంది!

చిరుతపులి ఆయా ప్రాంతాలలో ఉందా, ఏటైనా వెళ్లిపోయిందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. కానీ చిరుతపులి రిజర్వు ఫారెస్టు ఏరియాలలోనే ఉందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. పలుచోట్ల నేలపై కనిపించిన పాద ముద్రల ఆధారంగా అది రిజర్వు ఫారెస్టు ఏరియాలోనే తిరుగుతుందని గుర్తించామంటున్నారు. అంతేకాక ఆ ప్రాంతంలో పందులు, కుక్కలు అధికంగా ఉన్నాయని, అవన్నీ చిరుతపులి కోసం పెట్టిన బోనుల్లోకి వెళ్లడంతో తమ ప్రయత్నాలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. అయితే అదృష్టవశాత్తూ చిరుతపులి వలన ఇంతవరకు ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదు.



రిజర్వు ఫారెస్టు ఏరియాలో ఏర్పాటు చేసిన ఇనుప బోను

అసత్య ప్రచారాలు

చిరుతపులి సంచారంపై కొందరు ఆకతాయిలు చేస్తున్న అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని ఏమాత్రం నమ్మవద్దని అటవీశాఖ ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేసింది. అటువంటిపై వారిపై పోలీసులు శాఖాపరంగా చర్యలు తీసుకుంటారని హెచ్చరించింది.

శ్రీరామపురంలో చిరుతపులి కలకలం

దివాన్ చెరువు శివారు శ్రీరామపురంలోని రాకీ ఎవెన్యూ అపార్టుమెంట్ల సమీపంలో ఉన్న తోటల్లోకి బుధవారం రాత్రి చిరుతపులి దూకిందనే ప్రచారం జరుగుతోంది. ఈ వార్త ఆ ప్రాంతంలో ఒక్కసారిగా కలకలం రేపింది. శ్రీరామపురం నుంచి ఏవీ అప్పారావు జంక్షన్‌కి వెళ్లే రోడ్డులో గ్రామానికి కిలోమీటరు దూరంలో ఈ అపార్టుమెంట్లు ఉన్నాయి. వీటిలోని సుమారు 450 ప్లాట్లలో సుమారు వంద కుటుంబాలకు నివాసం ఉంటున్నాయి. పులి సంచరిస్తోందన్న వార్తలతో ఇక్కడ నివాసం ఉంటున్న వారితో పాటు ప్రస్తుతం సీతాఫలాల సీజన్ కావడంతో తోటల్లోకి వెళ్లేందుకు కూడా రైతులు భయపడుతున్నారు.

జిల్లా రిజిస్ట్రార్ల నియామకం

కాకినాడ లీగల్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ బదిలీల్లో భాగంగా కాకినాడ, తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల రిజిస్ట్రార్లతో పాటు మార్కెట్ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.



కె.ఆనందరావు



ఆర్.సత్యనారాయణ



సీహెచ్ నాగలింగేశ్వరరావు

- కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసున్న పి.రామలక్ష్మి పట్నాయక్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసున్న కె.ఆనందరావును నియమించారు.
- తూర్పుగోదావరి జిల్లా రిజిస్ట్రార్‌గా ఆర్. సత్యనారాయణను నియమించారు. ఆయన భీమవరం జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.
- బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసున్న జి.సాయితేజను బాపట్ల జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో కర్నూలు జిల్లాలో పనిచేసున్న సీహెచ్ నాగలింగేశ్వరరావును నియమించారు.
- మార్కెట్ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసున్న ఎల్.వెంకటేశ్వర్లు భీమవరం జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాష్ట్ర ఐజీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జె.జయలక్ష్మిని నియమించారు.

2,123 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

రావులపాలెం: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులతో కలిసి బుధవారం సీజ్ చేశారు. మండలంలోని రావులపాడు వద్ద రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్టు సమాచారం అందడంతో అధికారులు దాడి చేశారు. 36 బ్యాగుల్లో ఉన్న 2,123 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి వీటిని కొనుగోలు చేసి తీసుకువచ్చిన ముగ్గురి మూడు మోటారు సైకిళ్లు, ఒక వ్యాన్ సీజ్ చేశారు. ఈ బియ్యాన్ని ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిళ్లపై తీసుకువచ్చి గ్రామానికి చెందిన కర్రి రామిరెడ్డికి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడంపై కేసు నమోదు చేశారు. రూ.9,79,658 విలువైన 2,123 కేజీల బియ్యాన్ని సీజ్ చేయడంతో పాటు మోటారు సైకిలిస్టులపై క్రిమినల్ కేసు నమోదుకు పోలీస్ స్టేషన్‌కు సిఫారసు చేశారు, అలాగే రామిరెడ్డిపై 6ఏ కేసు నమోదు చేసి బియ్యాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు.



సీజ్ చేసిన రేషన్ బియ్యంతో అధికారులు

కూరగాయల దుకాణాల దగ్ధం

కిర్లంపూడి: రెండు కూరగాయల దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. బూరుగుపూడిలోని కమిషన్ కూరగాయల దుకాణాలకు మంగళవారం అర్ధరాత్రి నిప్పు అంటుకోవడంతో మంటలు ఎగసి పడ్డాయి. దీంతో జగ్గంపేట అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారి ఎస్.లక్ష్మణరావు తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. లక్ష్మణరావు మాట్లాడుతూ బూరుగుపూడి గ్రామానికి చెందిన వాకాడ సూరిబాబు, పట్టెం రాంబాబు మంగళవారం రాత్రి దుకాణాలు మూసివేసి ఇంటికి వెళ్లిపోయారు. ఇంతలో షాపులకు నిప్పు అంటుకున్నట్లు తెలుసుకున్న బాధితులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని లక్ష్మణరావు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ ఘటనకు పాల్పడినట్టు బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



కాలిపోతున్న కూరగాయల దుకాణం

ముగిసిన పొగాకు కొనుగోళ్లు

దేవరపల్లి: దేవరపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు బుధవారం సాయంత్రం ముగిశాయి. 2023–24 పంట సీజన్‌లో పండించిన పొగాకు కొనుగోలును మార్చి 6న ప్రారంభించారు. ఈ ఏడాది 153 రోజుల పాటు ఈ కార్యక్రమం జరిగింది. సుమారు రూ.336 కోట్ల విలువైన 1,05,58,092 కిలోల పొగాకు విక్రయాలు జరిగినట్టు పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. దీనిలో తొర్రేడు ప్రాంతంలో నల్లరేగడి భూముల్లో పండించిన పొగాకు 29,35,687 కిలోలు, దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలోని ఎస్ఎల్ఎస్ ప్రాంతంలో పండించిన పొగాకు 76,22,405 కిలోలు విక్రయాలు జరిగినట్టు ఆయన తెలిపారు. తొర్రేడు ప్రాంతంలో పండించిన పొగాకు దేవరపల్లి వేలం కేంద్రంలో విక్రయాలు జరిగినట్టు ఆయన తెలిపారు. కిలో గరిష్ట ధర రూ. 407, కనిష్ట ధర రూ.100, సగటు ధర రూ. 319.62 లభించిందన్నారు. చివరి రోజు వేలం కేంద్రానికి 1,539 బేళ్లు అమ్మకానికి వచ్చాయని, సాయంత్రం 6 గంటల వరకు వేలం ప్రక్రియ జరిగిందన్నారు. ఎస్ఎల్ఎస్ పొగాకుకు కిలో సగటు ధర రూ.333.74, బ్లాక్ సాయిల్ (బీఎస్)కు రూ.282.93 లభించిందన్నారు. ఈ ఏడాది వేలం కేంద్రంలో 5,28,049 బేళ్ల విక్రయాలు జరిగినట్టు వెల్లడించారు.



దేవరపల్లి కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

అభయమిచ్చారు.. ఆదుకున్నారు



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎంపీ వంగా గీత

- మహిళలకు అండగా నిలిచిన మాజీ సీఎం జగన్
- పిఠాపురంలో ఆర్థిక సాయం అందజేసిన మాజీ ఎంపీ వంగా గీత

పిఠాపురం: టీడీపీ నాయకులు దౌర్జన్యంగా గృహాలు కూల్చివేయడంతో నిరాశ్రయులై కష్టాలు పడుతున్న ఇద్దరు మహిళలకు వైఎస్సార్ సీపీ నాయకులు అండగా నిలిచారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలపై బుధవారం పిఠాపురంలోని పార్టీ కార్యాలయంలో రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత, పార్టీ నాయకుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. వివరాలు ఇవీ.. పిఠాపురం నియోజకవర్గంలో ఏలేరు వరద ముంపు ప్రాంతాలలో ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించారు. ఆయనను పిఠాపురంలోని సీతారామపురం, యు.కొత్తపల్లి మండలం కొండెవరం పంచాయతీ కాశివారి పాకలు గ్రామానికి చెందిన మైలవరపు లోవలక్ష్మి, వాసంశెట్టి శ్రీలక్ష్మి కలిశారు. తమ గృహాలను కొందరు టీడీపీ నేతలు ధ్వంసం చేశారని, దీంతో నిరాశ్రయులయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులకు తెలియజేసినా ఏ విధమైన సహకారం అందించలేదన్నారు. ఈ సంఘటనకు కారకులైన వారిపై జిల్లా పోలీస్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. వారి కష్టాలను విన్న మాజీ సీఎం జగన్ వెంటనే స్పందించారు. వైఎస్సార్ సీపీ లీగల్ టీంను పంపించి, న్యాయపరంగా సహకారం అందించేలా చూస్తామని తెలిపారు. అలాగే మహిళల సమస్యను గుర్తించి, వారికి ఆర్థికంగా అండగా ఉండాలని పార్టీ తరఫున సహకరించాలని తన వెంట ఉన్న మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతకు సూచించారు. ఆయన ఆదేశాలపై బుధవారం పిఠాపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పోలవరపు లోవలక్ష్మికి రూ.లక్ష, వాసంశెట్టి శ్రీలక్ష్మికి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని పార్టీ తరఫున అందజేశారు.

దాణా ముసుగులో జీడిపప్పు దిగుమతి!

కాకినాడ: పశువులదాణా ముసుగులో విదేశాల నుంచి ఇక్కడకు దిగుమతి చేస్తున్న జీడిపప్పును కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలుస్తోంది. పోర్టు వర్గాల విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వియత్నాం నుంచి పశువుల దాణా దిగుమతి చేసుకునేందుకు ఎలాంటి సుంకం చెల్లించాల్సిన అవసరం లేదు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు దిగుమతిదారులు సుమారు 8 నుంచి 10 కంటైనర్లలో అక్కడి నుంచి కాకినాడ రేవుకు జీడిపప్పును దిగుమతి చేసుకున్నారు. భారత్, వియత్నాం మధ్య ఉన్న ఒప్పందంలో భాగంగా పశువుల దాణా దిగుమతికి రాయితీ ఉండడంతో ఆ ముసుగులో జీడిపప్పును దిగుమతి చేసుకున్నారు. నాలుగైదు రోజుల క్రితం కస్టమ్స్ అధికారులు సదరు కంటైనర్లను స్వాధీనం చేసుకుని శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించారు. అయితే విషయాన్ని మాత్రం బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచుతున్నారు. కంటైనర్లలో వచ్చిన సరకుపై సుమారు 30 శాతం అంటే రూ.కోటిన్నరకు పైగా ప్రభుత్వానికి కస్టమ్స్ సుంకం చెల్లించాల్సి ఉంటుంది. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు.

గ్రామీణ ప్రాంతాలను బలోపేతం చేయాలి

సామర్లకోట: గ్రామీణ ప్రాంతాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత జిల్లా పరిషత్‌పై ఉందని పశ్చిమ గోదావరి జిల్లా ముఖ్య కార్యనిర్వాహణాధికారి కేఎస్ఎస్ సుబ్బారావు అన్నారు. శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి వరకూ ఉన్న 11 జిల్లాలలోని ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ)లో శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండో రోజు బుధవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సుబ్బారావు మాట్లాడుతూ గ్రామాల నుంచి రాష్ట్ర స్థాయికి అనుసంధానమయ్యే అతి పెద్ద వ్యవస్థ జిల్లా పరిషత్ అన్నారు. ప్రతి మండలం నుంచి ఎన్నికైన జిల్లా పరిషత్తు ప్రాదేశిక సభ్యుల ద్వారా జిల్లా పరిషత్ పాలక మండలి ఏర్పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను ఆయా మండలాలకు కేటాయించాల్సిన బాధ్యత జిల్లా పరిషత్ ఉందని తెలిపారు. విద్య, రక్షిత తాగునీరు, రోడ్లు, ప్రజారోగ్యం, పశుసంరక్షణ బాధ్యతలను జిల్లా పరిషత్ తీసుకుంటుందన్నారు. జిల్లా పరిషత్ ఆస్తులు గ్రామీణ ప్రాంతాల్లో ఉంటాయని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు మండల స్థాయి అధికారులపై ఉంటుందన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, జీఎస్ఆర్ శ్రీదేవి శిక్షణ ఇచ్చారు.



శిక్షణలో మాట్లాడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా సీఈఓ సుబ్బారావు

భర్తను కత్తెరతో హత్య చేసిన భార్య

ఉండ్రాజవరం: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యే కత్తెరతో భర్త గుండెల్లో పొడిచింది. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. సూర్యారావుపాలెం శివారు రెడ్డిచెరువులో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన చింతలపాటి శ్రీనివాసరావు (41) దాదాపు 15 ఏళ్ల క్రితం రాణిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. శ్రీనివాసరావు దుబాయ్‌లో పని చేసుకుంటూ ఉంటాడు. ఎనిమిది నెలల క్రితమే గ్రామానికి వచ్చాడు. ఇటీవల భార్యపై అనుమానం రావడంతో ఆమెను నిలదీశాడు. దీంతో రెండు నెలలుగా వారిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి రాణి తన భర్త గుండెల్లో కత్తెరతో పొడిచింది. తీవ్ర గాయాల పాలైన అతడిని స్థానికులు తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై గుబ్బల శ్రీనివాస్ పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీనివాసరావు మృతదేహం

వివిధ కోర్సులలో మహిళలకు శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ఎన్‌టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారసంస్థ (మహిళా ప్రాంగణం)లో మహిళలకు టైలరింగ్, స్వీట్స్ అండ్ స్నాక్స్ తయారీ (ఐదో తరగతి ఉత్తీర్ణులు), బ్యూటీషియన్ (పదోతరగతి పాస్/ఫెయిల్) కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సంస్థ జిల్లా మేనేజర్ సీహెచ్‌వీ నరసమ్మ బుధవారం ప్రకటన విడుదల చేశారు. కోర్సు కాల పరిమితి ఒక నెల ఉంటుందని, ఈ నెల 23 నుంచి కోర్సులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి కలిగిన 18 నుంచి 45 ఏళ్ల లోపు మహిళలు ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 83339 21340 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సెకండియర్ పీజీలో ప్రవేశానికి దరఖాస్తులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీతో పాటు అనుబంధంగా ఉన్న కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లు, కళాశాలలలో సెకండియర్ పోస్టు గ్రాడ్యుయేషన్ (లేటరల్ ఎంట్రీ)లో ప్రవేశానికి ఆసక్తి, అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు తెలిపారు. నాలుగేళ్ల యూజీ ఆనర్స్ డిగ్రీని పూర్తి చేసిన విద్యార్థి 3వ, 4వ సెమిస్టర్‌లలో పరిశోధనతో లేదా 3వ సెమిస్టర్‌లో మాత్రమే కోర్సు వర్కుతో, 4వ సెమిస్టర్‌లో ప్రోగ్రామ్ వర్క్‌తో 2 లేదా 3 సెమిస్టర్‌లో లేటరల్ ఎంట్రీకి అర్హులన్నారు. గురువారం నుంచి ఈ నెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25వ తేదీన కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. యూనివర్సిటీతో పాటు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలకు మంజూరైన 20 శాతం సూపర్ న్యూమరీ సీట్ల విభాగాలు/కళాశాలల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



తాడిమళ్లలో మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నిడదవోలు రూరల్: వ్యాన్ తిరగబడి జీడిగింజలు ఎగుమతి చేసే ఏడుగురు కూలీలు మృతి చెందిన నేపథ్యంలో ఆ కుటుంబాలకు తాడిమళ్ల, చిక్కాల జీడిపప్పు పరిశ్రమల యజమానుల అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. దేశాల బూరయ్య, కత్తవ నారాయుడు, కత్తవ కృష్ణ, తమ్మిరెడ్డి సత్యనారాయణ, తాడి కృష్ణ, పెనుగుర్తి చినముసలయ్య, ఉనకరమిల్లి గ్రామానికి చెందిన బొక్కా ప్రసాద్ కుటుంబాలకు రూ.90 వేల చొప్పున బుధవారం ఆర్థిక సాయం చేశారు. అలాగే మృతి చెందిన కూలీల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీడిపప్పు పరిశ్రమల యజమానుల అసోసియేషన్ సభ్యులు దిర్శిమిల్లి నాగబాబు, వద్దిరెడ్డి శ్రీను, రాచపోతు గణేష్, కొమ్మిరెడ్డి సూరిబాబు, దిర్శిమిల్లి రమేష్, కొప్పుల చినరామ్మోహనరావు, సభ్యులు పాల్గొన్నారు. దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం శివారు చిలకావారి పాకల వద్ద ఈ నెల 10వ తేదీ రాత్రి వ్యాన్ బోల్తా పడిన ఘటనలో నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలు మృతి చెందిన విషయం తెలిసిందే.

నేడు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాక



గజ్జల వెంకటలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి గురువారం రాజమహేంద్రవరం రానున్నారు. ఆమె రెండు రోజుల పాటు ఇక్కడ ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఈ విషయాన్ని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీడబ్ల్యూ ఆదేశానుసారం రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమం గురు, శుక్రవారాలలో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి హాజరవుతారన్నారు. పర్యటనలో భాగంగా ప్రత్యేక మహిళా జైలును ఆమె సందర్శిస్తారు, అలాగే ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బాధిత మహిళల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. గురువారం మధ్యాహ్నం 3 నుంచి 4 వరకూ, శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఆమె అందుబాటులో ఉంటారన్నారు.

ఆశ్రమ సొసైటీకి నూతన భవనం అందజేత



నాళం కుటుంబ సభ్యులతో అనాథలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డిబ్లాకులోని అమ్మ అంధ, వికలాంగులు, అనాథ శరణాలయం (ఆశ్రమ సొసైటీ)కి రూ.30 లక్షల విలువైన భవనాన్ని దాతలు అందించారు. నాళం జగ్గారావు, చంద్రమతి పేరు మీద వారి కుమారులు నాళం వెంకట సుబ్రహ్మణ్యం, మధుసూదనరావు, రవీంద్ర, రాఘవరావు, భాస్కరరావు, జగన్మోహనరావు దీన్ని అందజేశారు. వివరాల్లోకి వెళితే.. హుకుంపేట డిబ్లాక్ చేపల మార్కెట్ సెంట్‌లో అమ్మ అంధ, వికలాంగులు, అనాథ శరణాలయం నిర్వహిస్తున్నారు. దీనికి చిట్టిబాబు ప్రెసిడెంట్‌గా, నాగలక్ష్మి వైస్ ప్రెసిడెంట్‌గా, దుర్గాప్రసాద్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న ఆశ్రమంలో సుమారు 40 మంది ఉంటున్నారు. ప్రతి నెలా రేకులషెడ్డు అద్దెతో పాటు, మందులు, ఇతర ఖర్చులతో ఆశ్రమం నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. వర్షం వస్తే రేకులషెడ్డు నుంచి నీరు కారిపోతోంది. ఈ విషయాన్ని బాదం లక్ష్మీకుమార్ (జై బాబా) ద్వారా తెలుసుకున్న దాతలు వెంటనే స్థలం కొనుగోలు చేసి, దానిలో భవనం నిర్మించారు.